


సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో మనుమడు హిమాన్ష్‌తో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో మనుమరాలు అలేఖ్య, తనయుడు కేటీఆర్

# సంబురంగా కేసీఆర్ దసరా వేడుకలు

- ఎర్రవల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి..

మర్కూక్, అక్టోబర్ 13: సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని తన వ్యవసాయక్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యుల మధ్య దసరా వేడుకలు జరుపుకొన్నారు. శనివారం ఉదయం వ్యవసాయక్షేత్రంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాహనాలకు పూజలు చేయించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపారు. ఈ వేడుకల్లో కేసీఆర్ సతీమణి శోభ, తనయుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కోడలు శైలిమ, మనుమరాలు అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈడీ నుంచి రక్షిస్తున్న పెద్దన్న ఎవరు?

- కాంగ్రెస్ నేతలను కాపాడుతున్నదెవరు?
- మంత్రిపై దాడులు జరిగినా బీజేపీ, కాంగ్రెస్ మౌనం వెనుక మతలబేంటి?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో కొట్లాడుతున్నట్టు నాటకమాడుతూ బీజేపీ, కాంగ్రెస్ తెలంగాణలో అంట కాగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులపై ఈడీ దాడులు జరుగుతున్నా బీజేపీ నేతలెవరూ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ నాయకులను ఈడీ నుంచి రక్షిస్తున్న పెద్దన్న ఎవరో ప్రజలకు తెలియాలని డిమాండ్ చేశారు. 'ఫిక్షన్ కంటే వాస్తవం వింతగా ఉంటుందని రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలను చూస్తుంటే నమ్మక తప్పడంలేదు' అని ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన రెండు కీలక పరిణామాలను ఆయన ఉదహరించారు. రాష్ట్రంలో ఒక సంపన్న కాంగ్రెస్ మంత్రి అయిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో రెండు వారాల కిందట ఈడీ దాడి చేసిందని, దాడుల్లో వందల కోట్ల నగదు దొరికిందని మీడియాలో కథనాలు వచ్చాయని గుర్తుచేశారు. రెండు వారాలు పూర్తయినా ఈ సంఘటనకు సంబంధించి ఒక్క మాట కూడా బయటకి రాలేదని పేర్కొన్నారు. ఇప్పటికీ ఇటు కాంగ్రెస్, ఇటు బీజేపీ నుంచే కాకుండా కనీసం ఈడీ నుంచైనా అధికారిక లెక్కాపత్రం వెల్లడికాలేదని ఉదహరించారు.

### విషయం బయటకు పొక్కకుండా..

కర్ణాటకలో జరిగిన వాల్మీకి కుంభకోణం ద్వారా వచ్చిన రూ. 40 కోట్ల అక్రమ ధనాన్ని పార్లమెంట్ ఎన్నికల సమయంలో తెలంగాణలో కాంగ్రెస్ ఉపయోగించిందని స్వయంగా తన ప్రకటనలో ఈడీ వెల్లడించిన ఉదంతాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టులు ఏమీ జరగలేదని తెలిపారు. కనీసం దారిమళ్లిన నిధుల విషయంపైనా ఇప్పటికీ ప్రాథమిక విచారణ కూడా చేయకపోవడం పట్ల అనుమానాలున్నాయని పేర్కొన్నారు. ఈ పరిణామాలను పరిశీలిస్తే ఈడీ నుంచి తెలంగాణలో కాంగ్రెస్ నాయకులను రక్షిస్తున్న పెద్దన్న ఎవరనేది తేలాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# రేవంత్ హయాంలో రాజ్యాంగం ఖూనీ

మొదటిపేజీ తరువాయి...

చెప్పారు. మహేందర్‌రెడ్డి మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తరఫున ఎన్నికల్లో ప్రచారం చేశాడని గుర్తుచేశారు. అనర్హత వేటు వేయాల్సిన కౌన్సిల్ చైర్మన్ వద్దే పిటిషన్ పెండింగ్‌లో ఉండగా మహేందర్‌రెడ్డిని చీఫ్‌విప్‌గా నియమిస్తున్నట్టు బులెటిన్ ఇవ్వటం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. అనర్హత పిటిషన్‌లో చైర్మన్ ఇచ్చిన బులెటిన్‌ను కూడా చేరుస్తామని తెలిపారు. పీఏసీ చైర్మన్ పదవి విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇలానే వ్యవహరించిందని, అరికెపూడి గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్వయంగా సీఎం, మంత్రులు చెప్పారని, పట్నం మహేందర్‌రెడ్డి ఏ పార్టీకి చెందిన వ్యక్తో ప్రభుత్వం చెప్పాలని నిలదీశారు.

### సీఎస్‌పై ఫిర్యాదు చేస్తాం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మార్చి 15న పట్నం మహేందర్‌రెడ్డి చీఫ్ విప్ అని ఆదేశాలిచ్చారని, జూన్ 2, ఆగస్టు 15, సెప్టెంబర్ 17న ఎమ్మెల్సీ హోదాలోనే జాతీయ జెండా ఎగరవేస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శే జీవో జారీ చేశారని, చీఫ్ విప్‌గా ఆమె జీవో ఇచ్చి, జాతీయ జెండా విషయంలో మాత్రం ఎమ్మెల్సీగా పేర్కొన్నారని, ఒకే అధికారి, ఒకే వ్యక్తికి సంబంధించిన హోదాల విషయంలో ఎందుకు భిన్నమైన ఆదేశాలు ఇచ్చారో ఆమె చెప్పాలని హరీశ్ డిమాండ్ చేశారు. మార్చి 15నే పట్నం మహేందర్‌రెడ్డి చీఫ్ విప్ అయ్యి ఉంటే జూన్ 2, ఆగస్టు 15, సెప్టెంబర్ 17 సందర్భంగా జెండా ఆవిష్కరణలకు వెళ్లే అతిథిగా పట్నంను ఎమ్మెల్సీగా ఎందుకు చూపించారని ప్రశ్నించారు. రెండు జీవోలు కూడా గవర్నర్ పేరుమీదే విడుదలయ్యాయని, గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ విషయంలో గవర్నర్‌ను కూడా పక్కదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. సీఎస్‌పై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

### రాజ్యాంగబద్ధంగానే నియామకాలు: మంత్రి శ్రీధర్

రాష్ట్రంలో ఏ నియామకాలైనా రాజ్యాంగబద్ధంగానే జరిగాయని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై మండలి కార్యాలయంలో మీడియా అడిగిన ప్రశ్నలకు శ్రీధర్‌బాబు సమాధానమిచ్చారు. మహేందర్‌రెడ్డి విషయంలో రాజ్యాంగ పరిధిలోనే నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. హరీశ్‌రావుకు, బీఆర్ఎస్ వారికి అనుమానాలుంటే వ్యవస్థల పరంగా నివృత్తి చేసుకోవచ్చని వివరించారు. పీఏసీ చైర్మన్‌గా ప్రతిపక్ష సభ్యుడినే స్పీకర్‌గా చేశారని, గతంలో కాంగ్రెస్ శాసనసభ్యులను ఒకరి తర్వాత ఒకరిని బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని శ్రీధర్‌బాబు ఆరోపించారు.



శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు స్వీకరించిన సిరికొండ మధుసూదనాచారిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

# మండలిలో ప్రతిపక్షనేతగా సిరికొండ

- బాధ్యతలు స్వీకరించిన మధుసూదనాచారి
- కేటీఆర్, హరీశ్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు అభినందనలు

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా సిరికొండ మధుసూదనాచారి బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం శాసనమండలి ప్రాంగణంలో తనకు కేటాయించిన చాంబర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారిని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి హరీశ్‌రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కేటీఆర్ సూచించారు. మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ మంత్రులు మహమూద్ అలీ, జీ జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, దేశపతి శ్రీనివాస్, వాణీదేవి, నవీన్ కుమార్‌రెడ్డి, తాతా మధు, యాదవరెడ్డి, టీ రవీందర్‌రావు, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్, బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, దేవీ ప్రసాద్, గజ్జెల నగేశ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుల ఉమ, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై సిరికొండకు అభినందనలు తెలిపారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపనేని నరేందర్, బీఆర్ఎస్ నాయకులు మేడే రాజీవ్‌సాగర్, పల్లె రవికుమార్, కిశోర్‌గౌడ్, ఉపేంద్రాచారి, రాగిడి లక్ష్మారెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.

# పోరుబాటలో బీఆర్ఎస్వీ

## త్వరలో ప్రతినిధుల సభ.. • విద్యారంగం సమస్యలపై చర్చ

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): విద్యా రంగ సమస్యలపై పోరాటాలు చేసేందుకు బీఆర్ఎస్వీ సన్నద్ధం అవుతున్నది. బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యవర్గం, అన్ని జిల్లాల విద్యార్థి విభాగాల బాధ్యులతోపాటు నియోజకవర్గానికి కనీసం 10 మంది విద్యార్థి నాయకులతో తెలంగాణభవన్ వేదికగా ప్రతినిధుల సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. సమావేశానికి సంబంధించిన తేదీలను రెండు రోజుల్లో వెల్లడిస్తామని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. అన్నిస్థాయిల్లో విద్యా సంస్థలను కాంగ్రెస్ సర్కార్ నిర్వీర్యం చేస్తున్నదని, రోజుకోచోట గురుకులాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలే ఇందుకు నిదర్శమని ఉదహరిస్తున్నారు. కేసీఆర్ సర్కార్ పదేండ్లలో 662 గురుకులాలను ప్రారంభించడమే కాకుండా దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా 75 మహిళా డిగ్రీ కాలేజీలను ఏర్పాటుచేసిన విషయాన్ని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్న తీరును ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు చేరేలా కార్యాచరణను రూపొందిస్తున్నది. గురుకులాల్లో అన్ని సామాజిక వర్గాల విద్యార్థుల సమీకృతంగా సాధన చేస్తున్నారనే అంశం మంత్రులకు తెలియకపోవడం విడ్డూరమని బీఆర్ఎస్వీ నేతలు విమర్శిస్తున్నారు.

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 38.4°c | 23.7°c |
| మెదక్ | 35.2°c | 21.4°c |
| నిజామాబాద్ | 34.6°c | 23.9°c |
| ఖమ్మం | 33.0°c | 25.0°c |
| రంగారెడ్డి | 33.0°c | 21.0°c |
| కరీంనగర్ | 32.0°c | 24.0°c |
| వరంగల్ | 32.0°c | 24.0°c |
| హైదరాబాద్ | 31.7°c | 23.3°c |
| నల్లగొండ | 30.5°c | 23.4°c |
| మహబూబ్‌నగర్ | 30.3°c | 23.5°c |

# భిన్న వాతావరణంతో ప్రజల ఉక్కిరిబిక్కిరి

- ఉదయం ఎండ, సాయంత్రం వర్షం, రాత్రి ఉక్కపోత
- గ్లోబల్ వార్మింగ్, క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వైవిధ్య వాతావరణం

హైదరాబాద్,అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): అక్టోబర్ నెలలో సాధారణంగా చలి ఉంటుంది. ఇప్పుడు భిన్నమైన వాతావరణంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. ఉదయం ఎండలు చంపేస్తుంటే.. సాయంత్రం వర్షం కురుస్తుంది. ఆ వెంటనే చలి తీవ్రత ఉంటుంది. ఇక రాత్రి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా విరుద్ధమైన వాతావరణంతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇలాంటి వాతావరణం గతంలో ఎన్నడూ చూడలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఉదయం 7 నుంచే సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. సాయంత్రం 5 వరకు ఎండ తీవ్రత ఉంటున్నది. ఎండ తీవ్రతతోపాటు ఉక్కపోత అధికంగా ఉంటుంది. ఈ వేడికి వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా.. ఇలాంటి వాతావరణం గత వారం రోజులుగా ఉంటున్నది. 20 నిమిషాలు బయట తిరిగితేనే.. త్వరగా డీహైడ్రేషన్‌కు గురై.. తొందరగా అలిసిపోతున్నారు. పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లో ఈ పరిస్థితులు అధికంగా ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో గరిష్ఠ పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఈ వేడి కారణంగా తాము పని చేసుకోలేకపోతున్నట్టు రైతులు వాపోతున్నారు. పంటలు చేతికొచ్చే సమయం కావడంతో ఇబ్బంది పడుతున్నారు. రాత్రంతా ఫ్యాన్లు, ఏసీలు తిరుగుతున్నా ఉక్కపోత నుంచి ఉపశమనం లభించడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్లోబల్‌వార్మింగ్‌కు తోడు క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఈ వైవిధ్యమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరో వారం రోజులు ఈ ఈ తరహా పరిస్థితులు కొనసాగుతాయని అధికారులు స్పష్టంచేశారు.

# ఇస్రోతో జట్టుకట్టనున్న ఓయూ

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : తరగతి గదిలో కూర్చుని అంటార్కిటికాలో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇస్రో శాస్త్రవేత్తల బృందం అన్వేషణ గురించిన సమాచారాన్ని అందుకోవడమంటే మన ఊహకందని విషయం. కానీ ఇలాంటి ఊహను ఉస్మానియా వర్సిటీ విద్యార్థులు నిజం చేసుకోబోతున్నారు. నేరుగా శాస్త్రవేత్తలతో ఇంటరాక్షన్ కానున్నారు. అంటార్కిటికా స్పేస్ రీసెర్చ్ లింక్‌ను ఓయూతో అనుసంధానించనున్నారు. ఇందుకోసం త్వరలోనే ఉస్మానియా వర్సిటీ ఇస్రోతో ఎంవోయూను కుదుర్చుకోనుంది. ఈ ఎంవోయూ ద్వారా స్పేస్ టెక్నాలజీ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తారు. అంటార్కిటికాలో వాతావరణ మార్పులపై ఇస్రో పరిశోధనలను నిర్వహిస్తున్నది. ఓజోన్ సాంద్రత, జియో ఫిజికల్ రీసెర్చ్, మంచు డ్రిల్లింగ్, జీవులు, వన్యప్రాణుల అధ్యయనం చేస్తున్నది. ఆయా అంశాల్లో ఇస్రోశాస్త్రవేత్తలు విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. ఈ అన్వేషణలో ఉపయోగించే సాధనాలు, వాటి నిర్వహణపై తర్ఫీదునిస్తారు. అంతరిక్ష నావిగేషన్ వ్యవవస్థ, అంతకరిక్ష సాధనాల నిర్వహణపై స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహించేందుకు ఈ ఎంవోయూ సహకరించనున్నది. డిప్లొమా, ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఈ నైపుణ్య శిక్షణనిచ్చేందుకు వర్సిటీ ఏర్పాట్లు చేస్తున్నది.



జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్‌తో దీక్ష విరమింపజేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

# రుణమాఫీ అందరికి వర్తింపజేయాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి డిమాండ్
- 48 గంటల దీక్షను విరమించిన గాంధీ

కొడకండ్ల, అక్టోబర్ 13: దొంగ హామీలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కారుపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తక్షణమే షరతులు లేకుండా రుణమాఫీ చేసి రైతులకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జీసీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గాంధీనాయక్ జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండాలోని ఆయన నివాసంలో 48 గంటలపాటు ఉపవాస దీక్ష నిర్వహించగా, శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. రైతుబంధు స్థానంలో రైతుభరోసా ఇస్తామన్నారు.. కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం అన్నారు ఇప్పటివరకే ఏదీ లేదని ఎద్దేవా చేశారు.

# డౌన్ మెరిట్‌ను అమలు చేయండి

- గురుకుల అభ్యర్థుల డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): గురుకుల నియామకాల్లో డౌన్ మెరిట్ విధానాన్ని అమలు చేయాలని 1:2 జాబితాలోని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం మరోసారి ప్రభుత్వ పెద్దలను కలిసి విన్నవించడంతోపాటు, నిరసన కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. ట్రిబ్ ద్వారా 9,210 పోస్టుల భర్తీని చేపట్టగా.. అందులో భారీగా పోస్టులు మిగిలిపోతున్నాయి. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ తదితర పోస్టులకు కామన్ పేపర్‌ను పెట్టడం, ఆ తర్వాత నియామకం సందర్భంగా అవరోహణ క్రమాన్ని పాటించకపోవడంతో దాదాపు 4 వేలకుపైగా పోస్టులు బ్యాక్‌లాగ్‌లో పడిపోతున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ నేపథ్యం లో డౌన్ మెరిట్ విధానాన్ని అమలు చేస్తే పోస్టులన్నీ భర్తీ కావడంతోపాటు మళ్లీ పరీక్షలను నిర్వహించాల్సిన అవసరం తప్పుతుందని, విద్యార్థులకు సైతం లబ్ధిచేకూరుతుందని చెప్తున్నారు. డౌన్‌మెరిట్ విధానానికి హైకోర్టు సైతం ఆమోదం తెలిపినప్పటికీ దాన్ని అమలు చేసేందుకు ట్రిబ్ నిరాకరిస్తున్నదని నిప్పులు చెరుగుతున్నారు.

# కొడంగల్‌పై సీఎం సవతి ప్రేమ

- సొంత గ్రామాభివృద్ధికి రూ.200 కోట్లు
- గెలిపించిన నియోజకవర్గానికి ఏం చేశారు?
- ఫార్మా కంపెనీలను అడ్డుకొని తీరుతాం
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



కొడంగల్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, అక్టోబర్ 13 : వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజక వర్గంపై సీఎం సవతి ప్రేమ చూపుతున్నారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి విమర్శించారు. సీఎం తన సొంత గ్రామంలో రూ.రెండు వందల కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించడంపై ఆయన మండిపడ్డారు. ఆదివారం ఆయన కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, కోస్గి, మద్దూరు, దుద్యాల, కొత్తపల్లి, గుండుమాల్ మండలాల్లో దసరా వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం నరేందర్‌రెడ్డి కొడంగల్‌లో మీడియాతో మాట్లాడారు. దసరా రోజున సీఎం తన సొంత గ్రామంలో రూ. 200 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించి.. తనను ఎమ్మెల్యేగా గెలిపించి.. ముఖ్యమంత్రిని చేసిన కొడంగల్ నియోజకవర్గ ప్రజలపై సవతి తల్లి ప్రేమను చూపుతున్నారని మండిపడ్డారు. సోలార్ పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌ను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కొడంగల్‌కు కాలుష్యాన్ని అంటగట్టే ఫార్మా కంపెనీల ఏర్పాటు చేసే దిశగా సీఎం రేవంత్ చర్యలు తీసుకోవడం బాధాకరమని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరంలో ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం 14 వేల ఎకరాలను సేకరిస్తే, దాన్ని కాదని కొడంగల్‌లో ఏర్పాటు చేసేందుకు సీఎం ఎందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలోని కొత్తూరులో 50 ఎకరాల్లో ఫార్మా కంపెనీని ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతం పూర్తిగా కాలుష్యంతో నిండిపోయి ప్రజలు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఫార్మా కాకుండా టెక్స్‌టైల్, ఐటీ తదితర కంపెనీలను ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామని అన్నారు. ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలని చూస్తే కచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీని కేవలం 30 శాతం మందికే పూర్తి చేసిందని.. సీఎం సొంత నియోజకవర్గంలోనూ పూర్తి స్థాయిలో కాలేదని ఆయన పేర్కొన్నారు. దసరా నాటికి రైతు భరోసా అమలు చేస్తామని చెప్పినా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు.

# ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత

మొదటిపేజీ తరువాయి...

నుంచే వీల్‌చైర్‌ను ఉపయోగిస్తున్నారు. వారి గృహానికి కనీసం విద్యుత్తు సౌకర్యం కూడా లేదు. అయినా 90% వైకల్యంతో బాధపడుతూనే ఎంతో కష్టపడి చదివారు. అమలాపురంలోని కోనసీమ భానోజీ రామర్స్ కాలేజ్‌లో గ్రాడ్యుయేషన్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి పీజీ పూర్తి చేసిన ఆయన.. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్‌లోనూ విద్యాభ్యాసం చేశారు. అనంతరం ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని రామ్‌లాల్ ఆనంద్ కాలేజీలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా కెరీర్ ప్రారంభించి అక్కడే ఎన్నో ఏండ్లుగా పనిచేశారు. 2013లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అమలాపురంలో డిగ్రీ చదువుతున్నప్పుడే వామపక్ష రాజకీయాలకు ఆకర్షితులైన సాయిబాబా.. ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరమ్‌లో చేరారు. 1992లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదివేటప్పుడే ఏఐఆర్‌పీఎఫ్ ఆంధ్రప్రదేశ్ కమిటీకి కార్యదర్శిగా నియమితులైన సాయిబాబా.. 1995 నాటికి ఆ సంస్థలో జాతీయ ప్రధాన కార్యదర్శి అయ్యారు. ఆ తర్వాత ఆర్‌డీఎఫ్ అనే సంస్థలో చేరినట్టు తెలుస్తున్నది. ఇవన్నీ మావోయిస్టు అనుబంధ సంస్థలేనని పోలీసులు చెప్తున్నారు.

### వెంటాడిన కేంద్రం

మహారాష్ట్ర ప్రభుత్వం 2013లో హేమ్ మిశ్రా, ప్రశాంత్ రాహి అనే మావోయిస్టులను అరెస్టు చేసింది. ప్రొఫెసర్ సాయిబాబా సహకారంతో మావోయిస్టు నేతలను కలిసేందుకు వెళ్తున్నట్టు పోలీసులకు వారు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో 2013 సెప్టెంబర్‌లో ఢిల్లీలోని సాయిబాబా ఇంట్లో సోదాలు నిర్వహించిన పోలీసులు.. మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో 2014 మే నెలలో ఆయనను అరెస్టు చేశారు. వైద్య కారణాల రీత్యా 2015 జూన్‌లో సాయిబాబాకు బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ అదే ఏడాది డిసెంబర్‌లో మళ్లీ జైలుకు వెళ్లారు. దీంతో 2016 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2017 మార్చిలో సాయిబాబా కేసు దర్యాప్తును చేపట్టిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆయనపై ఐపీసీలోని పలు సెక్షన్లతోపాటు ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)లోని 13, 18, 20, 39 సెక్షన్ల కింద చార్జిషీట్ దాఖలు చేసింది. 2017 వరకు ఈ కేసు విచారించిన గడ్చిరోలి జిల్లా సెషన్స్ కోర్టు సాయిబాబాతోపాటు మరో ఐదుగురికి జీవిత ఖైదు విధించింది. దీంతో ఢిల్లీ వర్సిటీలోని రామ్‌లాల్ ఆనంద్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం నుంచి 2021 ఫిబ్రవరిలో సాయిబాబాను తొలగించారు.

### 2022లో నిర్దోషిగా ప్రకటన

2014 నుంచి 3,588 రోజులపాటు జైలులోనే ఉన్న ప్రొఫెసర్ సాయిబాబా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నారు. నరాలు దెబ్బతినడం, కాలేయ సమస్యలు, బీపీ తదితర సమస్యలు చుట్టుముట్టాయి. వీటితోపాటు హృద్రోగ సమస్యలు కూడా ఉన్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రొఫెసర్ సాయిబాబాతోపాటు విప్లవ రచయితర సంఘం (విరసం) నేత వరవరరావు ఆరోగ్యం దెబ్బతినడంతో వారి బంధువులు, అభిమానుల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఆ తర్వాత 2022 అక్టోబర్‌లో బాంబే హైకోర్టులోని నాగ్‌పూర్ బెంచ్ సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించింది. ఈ తీర్పుపై మహారాష్ట్ర ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లడంతో సాయిబాబా విడుదలపై సుప్రీంకోర్టు 2022 అక్టోబర్‌లో స్టే ఇచ్చింది. ఆ కేసులో మహారాష్ట్ర సర్కారు వాదనను తిరిగి వినాలని బాంబే హైకోర్టుకే రిఫర్ చేసింది. దీంతో ఈ ఏడాది మార్చి 5న బాంబే హైకోర్టు ఆయనను మరోసారి నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది.

### గాంధీ ఆస్పత్రికి పార్థివదేహం అప్పగింత

ప్రొఫెసర్ సాయిబాబా అంతిమయాత్రను సోమవారం నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. హైదరాబాద్ జవహర్‌నగర్‌లోని లైఫ్ స్ప్రింగ్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న శ్రీనివాస హైట్స్ వద్ద నుండి మధ్యాహ్నం 2 గంటలకు అంతిమయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. అంతకుముందు ఉదయం 9 గంటలకు సాయిబాబా పార్థివ దేహాన్ని గన్‌పార్క్‌కు చేర్చి అక్కడ పావుగంటపాటు ఉద్యమ సహచరుల సందర్శనార్థం ఉంచుతామన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా కోరిక మేరకు ఆయన భౌతికకాయాన్ని పరిశోధనల నిమిత్తం గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించనున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే ఆయన నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి దానమిచ్చినట్టు తెలిపారు.

# ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

## ప్రొఫెసర్ సాయిబాబా మృతికి కేటీఆర్ సంతాపం

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): హక్కుల ఉద్యమకారుడు, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం దేశంలోని ప్రజా ఉద్యమాలకు తీరని లోటని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదిరించి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. ఆయన మరణం పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### సాయిబాబా మృతి బాధాకరం: మాజీ మంత్రి హరీశ్‌రావు

విద్యావేత్త, మానవ హక్కుల కార్యకర్త ప్రొఫెసర్ సాయిబాబా మృతి బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొన్న ధీరుడు: సీపీఎం

ప్రొఫెసర్ సాయిబాబా మృతి పట్ల సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపాన్ని వ్యక్తం చేసింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 90% అంగవైకల్యంతో బాధపడుతున్న సాయిబాబాను కేంద్ర ప్రభుత్వం అర్బన్ నక్సలైట్‌గా ముద్రవేసిందని, కుట్రపూరితంగా దేశద్రోహ నేరం మోపి ఉపా చట్టం కింద సుదీర్ఘ కాలంపాటు జైలులో నిర్బంధించిందని మండిపడ్డారు. జైలులో ఉన్న సమయంలో ఆయనకు సరైన వైద్య సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### రాజీలేని పోరాటం: సీపీఐ నారాయణ

ప్రొఫెసర్ సాయిబాబా మరణం పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. నిజజీవితంలో సాయిబాబా వికలాంగుడైనా ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదిరించి రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి ఎప్పటికీ ఉంటుందని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాయిబాబా మృతి పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర మంత్రి సీతక్క కూడా సంతాపం వ్యక్తం చేశారు.

### సాయిబాబా మరణం బాధాకరం: మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్

మానవ హక్కుల కార్యకర్త ప్రొఫెసర్ సాయిబాబా మరణం బాధాకరమని మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సాయిబాబాది ధిక్కార స్వరం కాదని, ఆయన అసమ్మతి వాది మాత్రమేనని అన్నారు. ఆయన మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.